నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence 08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna Every Wednesday Free Supplement
25 డిసెంబర్ 2024
పేజీలు 8

**ఓం ప్రకాశ్ చౌతాలా**

హర్యానా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా మరణించారు. ఆ రాష్ట్రానికి ఆయన ఏడో ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయిదు సార్లు ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. అక్రమాస్తుల కేసుకు సంబంధించి 2022లో జైలు జీవితం గడిపారు. తీహార్ జైల్లో ఉన్న అత్యంత పెద్ద వయస్కుడిగా ఆయన నిలిచారు.

## అంతర్జాతీయం

**ప్రపంచ ఆరోగ్య సంస్థ**

- ఏటా జనవరి 10న 'ఆయుష్ మెడికల్ కోడింగ్ అండ్ రికార్డ్స్ డే'గా నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది. 2025లో తొలిసారి ఈ వేడుకను నిర్వహించనున్నారు. డెహ్రాడూన్‌లో నిర్వహించిన పదో ప్రపంచ ఆయుర్వేద సదస్సులో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**అంతర్జాతీయ సౌర కూటమి**

- భారత్‌లోని గురుగ్రామ్ కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ సౌర కూటమిలో కొత్తగా మాల్డోవా చేరింది.



**ప్రపంచ ఆర్థిక ఫోరం**

- ప్రపంచ ఆర్థిక ఫోరం ప్రచురించిన ట్రావెల్ అండ్ టూరిజం ఇండెక్స్‌లో భారత్ 39వ స్థానంలో నిలిచింది. మొత్తం 119 దేశాలకు ర్యాంకులను కేటాయించారు.

**గధిమాయ్**

- గధిమాయ్ వేడుకను నేపాల్‌లో నిర్వహిస్తారు. ఆ దేశంలో నైరుతి ప్రాంతంలో జరిగే ఈ వేడుక వివాదాస్పదమైంది. జంతు హింస ఉన్నదని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయిదు సంవత్సరాలకు ఒకసారి ఆ దేశంలో ఈ పండుగ జరుగుతుంది.

**భారత్-చైనా**

- భారత్, చైనా దేశాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధుల 23వ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కైలాష్ మానస సరోవర్ యాత్ర, నదుల విషయంలో సహకారంతో పాటు నాథులా కనుమ గుండా వాణిజ్యానికి కూడా పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. భారత్ తరపున ఈ చర్చల్లో అజిత్ దోవల్ పాల్గొన్నారు.



**ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్**

- క్యాన్సర్ చికిత్సకు ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌ను రష్యా అభివృద్ధి చేసింది. దీన్ని తమ దేశ పౌరులందరికీ ఉచితంగా ఇవ్వాలని కూడా రష్యా నిర్ణయించింది.

## జాతీయం

**ఒకే దేశం ఒకే ఎన్నిక**

- లోక్‌సభతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నిక నిర్వహించాలన్న ప్రతిపాదనతో లోక్‌సభలో రెండు బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టింది. లోక్‌సభ, అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటూ ఒక బిల్లు కాగా, కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మరో బిల్లును కూడా ప్రవేశపెట్టారు. 2034 నుంచి ఇది అమల్లోకి రానుంది. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు ఇది. 2029 ఎన్నికల తర్వాత 'అపాయింటెడ్ డే'ను రాష్ట్రపతి ప్రకటిస్తారు. ఇది 2034లో ఉంటుంది. అక్కడి నుంచి అన్ని రాష్ట్రాల శాసనసభలు, లోక్‌సభ కూడా అప్పుడే కొలువు తీరుతాయి.



**సీసీటీఎన్ఎస్**

- దేశంలోని 17,130 పోలీస్ స్టేషన్లను క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)తో అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. నేరాలను కట్టడి చేయడంతో పాటు నేర పరిశోధనలో మరింత సమన్వయం సాధించేందుకు ఉద్దేశించిన వ్యవస్థ ఇది. సీసీటీఎన్ఎస్ వ్యవస్థను 2009లో ప్రారంభించారు. దీన్ని ఆధునీకరించాలని తాజాగా నిర్ణయించారు.

**భారత్-ఫ్రాన్స్**

- భారతదేశ నాగరికత ప్రతిబింబించడంతో పాటు సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌ను మరింత మెరుగ్గా చేసే ఉద్దేశంతో ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియాన్ని న్యూఢిల్లీలో నిర్మించనున్నారు. ఇందుకు ఫ్రాన్స్ సాయం చేయనుంది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య ఒక ఒప్పందం కూడా కుదిరింది.



**కొబ్బరి నూనె**

- కొబ్బరి నూనె వంటనూనె కిందకు వస్తుందని సుప్రీంకోర్ట్ తీర్పు చెప్పింది. 15 సంవత్సరాలుగా ఉన్న ఈ వివాదం ఈ తీర్పుతో కొలిక్కి వచ్చింది. ప్రస్తుతం కొబ్బరి నూనెపై అధికంగా పన్ను విధిస్తున్నారు. వంటనూనె విభాగంలో చేరడంతో దీనిపై ఇకనుంచి కేవలం 5% మాత్రమే పన్ను విధిస్తారు.

**జల్ వాహక్**

- జల్ వాహక్ పథకాన్ని కేంద్రం ప్రకటించింది. సరకు రవాణాను జల మార్గం గుండా చేసేందుకు ఉద్దేశించింది ఇది. జాతీయ జల మార్గాలు 1, 2, 16 గుండా ఈ మార్గం అందుబాటులోకి రానుంది. రహదారి గుండా కాకుండా దీన్ని ఎంచుకుంటే 35% రాయితీని ప్రకటించనున్నారు.

**నెవా 2**

- ఎన్ఈవీఏ- నేషనల్ ఈ విధాన్ అసెంబ్లీ. శాసనసభలను కాగిత రహితంగా మార్చేందుకు ఉద్దేశించింది. ప్రస్తుతం దీన్ని మరింత ఆధునీకరించారు. దీనికి నెవా 2 అని పేరు పెట్టారు. బహుళ భాషల్లో సేవలు అందుబాటులోకి తేవడంతో పాటు భద్రత, నేషనల్ క్లౌడ్ కంప్యూటింగ్‌లో నెవా వ్యవస్థను భాగం చేశారు.

## ఆర్థికం

**కనీస మద్దతు ధరపై చట్టానికి సిఫారసు**

- కనీస మద్దతు ధరకు సంబంధించి ఒక చట్టాన్ని తీసుకురావాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఒకటి సూచించింది. దీనికి పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ నేతృత్వం వహించారు. అలాగే బడ్జెట్‌లో వ్యవసాయానికి అధికంగా కేటాయింపులు చేయాలని, పీఎం-కిసాన్ కింద ఇచ్చే మొత్తాన్ని పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రుణ ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఈ కమిటీ సూచించింది.

**కిసాన్ కవచ్**

- రైతులకు పురుగు మందుల ప్రభావం నుంచి తప్పించేందుకు కేంద్రం కిసాన్ కవచ్ అనే కొత్త సాధనాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీని విలువ రూ. 4000. పురుగు మందులు చల్లేటప్పుడు రైతులు ప్రమాదాల బారిన పడకుండా ఇది రక్షిస్తుంది.




**ఎగుమతులు**

- స్మార్ట్ ఫోన్ల ఎగుమతిలో భారత్ మూడో స్థానానికి చేరింది. 2019లో 23వ స్థానంలో ఉంది. భారత్‌లో తయారీ పథకంలో భాగంగా ప్రోత్సాహకాలు అందడంతో భారత్ మెరుగైన స్థానాన్ని పొందింది.

## క్రీడలు

**బుమ్రా రికార్డ్**

- ఆస్ట్రేలియాలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా బుమ్రా కొత్త రికార్డ్‌ను నెలకొల్పాడు. 51 వికెట్లతో ఇప్పటి వరకు కపిల్‌దేవ్ పేరిట ఈ రికార్డ్ ఉంది. 52 వికెట్లతో బుమ్రా కొత్త రికార్డ్‌ను నెలకొల్పాడు.

**38వ జాతీయ క్రీడలు**

- 38వ జాతీయ క్రీడలు ఉత్తరాఖండ్‌లో 2025, జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఆ రాష్ట్ర పక్షి మోనాల్‌ను ప్రతిబింబించేలా 'మౌలి' అనే మస్కట్‌ను ఎంపిక చేశారు. అలాగే 'సంకల్ప్ సే శిఖర్ తక్' అనే ట్యాగ్‌లైన్ పెట్టారు. సంకల్పం తీసుకున్న దగ్గరి నుంచి విజయం సాధించే వరకు అనే అర్థాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.




## వార్తల్లో వ్యక్తులు

**అరుణ్ కపూర్**

- భారత విద్యావేత్త అరుణ్ కపూర్‌కు భూటాన్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. ఆయన డూన్ పాఠశాలలో పనిచేయడంతో పాటు వసంత్ వ్యాలీ అనే విద్యా వ్యవస్థను నెలకొల్పారు.

**రామ మోహన్ రావు**

- దేశంలో అతిపెద్ద బ్యాంక్ అయిన ఎస్‌బీఐకు మేనేజింగ్ డైరెక్టర్‌గా అమర రామ మోహన్ రావు నియమితులయ్యారు.



**సూర్య బాల**

- ప్రముఖ హిందీ రచయిత్రి సూర్య బాలకు 34వ వ్యాస సమ్మాన్ అవార్డ్ 2024 దక్కింది. 'కౌన్ దేశ్ కో వాసి: వేణు కి డెయిరీ' అనే పుస్తక రచనకు ఈ అవార్డ్ దక్కింది. 1991లో కేకే బిర్లా ఫౌండేషన్ ఈ అవార్డ్‌ను ఏర్పాటు చేసింది.

## తెలంగాణ

**రాజశేఖర రావు**

- నాగర్ కర్నూలు జిల్లా సైన్స్ అధికారి తల్లునూరి రాజశేఖర్ రావు భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. ఆయన ఇదే జిల్లా తెలకపల్లి మండలంలోని చిన్న ముద్దునూర్ పాఠశాలలో జీవ శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తూ జిల్లా సైన్స్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ నుంచి ఈ అవార్డ్‌ను అందుకుంటున్న ఏకైక వ్యక్తి ఆయన.

**కొత్త కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు**




- రాష్ట్రంలో కొత్తగా రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు ఏర్పాటు కానున్నాయి. మహబూబ్‌నగర్, మంచిర్యాల మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మార్చనున్నారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ల సంఖ్య 15కు చేరనుంది. కొత్తగా 12 మున్సిపాలిటీల ఏర్పాటుతో వీటి సంఖ్య 153కు చేరనుంది.

**డిజిటల్ ఇంజినీరింగ్ అవార్డ్**

- తెలంగాణ పోలీసులకు డిజిటల్ ఇంజినీరింగ్ అవార్డ్ దక్కింది. గణేష్ నిమజ్జనంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించినందుకు తెలంగాణ పోలీసులకు ఈ అవార్డ్‌ను ప్రకటించారు. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఏఐలతో 1,50,510 గణేష్ ప్రతిమల నిమజ్జనాన్ని పర్యవేక్షించారు. 733 సీసీ, డ్రోన్ కెమెరాలను వ్యూహాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. 15 వేల మంది మున్సిపల్ సిబ్బంది, 25 వేల మంది పోలీసులు క్షేత్ర స్థాయిలో పనిచేశారు. ప్రపంచ వ్యాప్తంగా 230 నామినేషన్లలో తెలంగాణకు అవార్డ్ దక్కింది. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ గ్రూప్, సీఎస్‌బీసీ-టీవీ 18 సంయుక్తంగా అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డ్‌ను ప్రకటించారు.

**జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

- హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ శాశ్వత ట్రస్టీగా సుప్రీంకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ పదవిలో ఉన్న జస్టిస్ లావు నాగేశ్వరరావు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఆ స్థానాన్ని ఆయన చేపట్టారు.

**క్రీడా విశ్వవిద్యాలయం**

- తెలంగాణ యువ భారత వ్యాయామ విద్య, క్రీడా విశ్వవిద్యాలయం స్థాపించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి ముఖ్యమంత్రి చాన్స్‌లర్‌గా ఉంటారు. క్రీడా విద్య, అథ్లెటిక్స్, శిక్షణ, క్రీడా వైద్యశాస్త్ర రంగాల్లో నిపుణులను తయారు చేయడం ఈ విశ్వవిద్యాలయం ముఖ్య లక్ష్యం.



## రోజులు-ప్రాధాన్యం

**డిసెంబర్ 20**

- మానవత్వానికి సంఘీభావ రోజును డిసెంబర్ 20న నిర్వహిస్తారు. 2005లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ చేసిన తీర్మానంతో ఈ రోజును చేపడుతున్నారు. అలాగే ఇదే రోజున 1963లో సశస్త్ర సీమా బల్‌ను ఏర్పాటు చేసినందున ఆ విభాగపు 'రైజింగ్ డే' కూడా నిర్వహిస్తారు.

**డిసెంబర్ 18**

- ఏటా డిసెంబర్ 18న మైనారిటీ హక్కుల రోజుతో పాటు వలసలకు వెళ్లిన వారి సంక్షేమం కోసం ఉద్దేశించిన 'ఇంటర్నేషనల్ మైగ్రేషన్ డే' కూడా నిర్వహిస్తారు.

**డిసెంబర్ 16**

- ఏటా డిసెంబర్ 16న విజయ్ దివస్ నిర్వహిస్తారు. 1971లో డిసెంబర్ 3 నుంచి 16 వరకు పాకిస్థాన్‌తో యుద్ధం జరిగింది. దీని ఫలితంగా బంగ్లాదేశ్ దేశం ఏర్పాటయ్యింది. భారత్ విజయం సాధించిన నేపథ్యంలో ఏటా డిసెంబర్ 16న విజయ్ దివస్‌గా నిర్వహిస్తున్నారు.

వి. రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411

